క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం పెట్టండి



భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న పథకంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. వారు శుక్రవారం నెలవాయి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరమైనది అందించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు డ్రోన్లు



తారక రామానగర్‌లో డ్రోన్ వినియోగిస్తున్న పోలీసులు

రేణిగుంట: నేరాల నియంత్రణకు డ్రోన్లు వినియోగిస్తున్నట్టు రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర తెలిపారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ, తారక రామానగర్, మల్లిమడుగు, కరకంబాడి, ఇంజినీరింగ్ కాలేజీల వెనక వైపు తదితర ప్రాంతాలలో శుక్రవారం డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు డ్రోన్ల సాయం తీసుకుంటున్నట్టు చెప్పారు.

సత్తా చాటిన ఎంజీఎం విద్యార్థిని



నైనిత

శ్రీకాళహస్తి: ఇటీవల జరిగిన ఎస్ఎఫ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఎంజీఎం పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని నైనిత సత్తా చాటి ఇంటర్నేషనల్ ర్యాంకు 13,424, రాష్ట్ర ర్యాంకు 625 సాధించింది. ఎస్ఓఎఫ్ నుంచి విద్యార్థినికి సర్టిఫికెట్, పతకం ఇచ్చారు. శుక్రవారం ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మునిరత్నంనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశురేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ధ్వజావరోహణంతో ఘనంగా ముగిశాయి. ఉదయం ఆలయంలో అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను పూర్తిచేశారు. త్రిశూలాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఉత్సవర్లకు, త్రిశూలానికి స్నపన తిరుమంజనం పూర్తి చేశారు. ఆలయానికి కోనేరు లేని కారణంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గంగాళంలో నింపిన జలానికి సంప్రోక్షణ చేసి త్రిశూలాన్ని మూడు మునకలు వేయించారు. సాయంత్రం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుడి చిత్రపటమున్న వస్త్రాన్ని కిందకు దింపడంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో స్థానిక ఆలయాల ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను పూర్తి చేసిన అర్చకులకు మేళతాళాలతో బ్రహ్మోత్సవ బహుమానాన్ని అందించారు.

ఘనంగా వంగవీటి జయంతి



శ్రీకాళహస్తి: పట్టణంలోని వంగవీటి మోహన రంగా సర్కిల్ వద్ద శుక్రవారం వంగవీటి రాధా రంగ మిత్రమండలి అధ్యక్షుడు సిద్దులగారి ప్రసాద్, బలిజల ఆధ్వర్యంలో వంగవీటి రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు రంగా సేవలను స్మరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు, తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి





అర్జున తపస్మాన్

- భక్త జనసంద్రమైన ధర్మరాజస్వామి ఆలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ చెన్నై రోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ భక్త జనసంద్ర నడుమ ఘనంగా నిర్వహించారు. మహాభారతంలో అర్జునుడు తపస్సు చేసి శివునితో పోరాడి తరువాత తప్పు తెలుసుకుని పాశుపతాస్త్రాన్ని పొందే ఘట్టం ఉంది. ఈ ఘట్ట ప్రదర్శనకు భక్తులు విశేషంగా రావడం పరిపాటి. ఈ నేపథ్యంలో ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను అర్జున వేషధారి పద్యాలు ఆలపిస్తూ పైకి అధిరోహించాడు. తన వెంట తీసుకెళ్లిన నిమ్మకాయలను తపస్మాన్‌పై నుంచి విసరడంతో వాటిని దక్కించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ నిమ్మకాయలను స్వీకరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని, కోరిన కోర్కెలు ఫలిస్తాయని భక్తుల నమ్మకం. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







ఊరేగుతున్న అర్జునుడు, తపస్మాన్ ఘట్టం, హాజరైన జనం



తపస్మాన్ నుంచి నిమ్మకాయలు విసురుతున్న అర్జున వేషధారి, నిమ్మకాయల కోసం పోటీలు పడుతున్న భక్తులు

నోటీస్ బోర్డు

మండల సమావేశం వాయిదా

ఏర్పేడు: మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 8వ తేదీకి వాయిదా పడింది. శనివారం నిర్వహించాల్సిన ఈ సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సౌభాగ్యం తెలిపారు.

ఆర్థిక సంరక్షణకు బీమా



ప్రసంగిస్తున్న మేనేజర్ మీన

వరదయ్యపాళెం: జెన్ సురక్ష బీమా అటల్ పెన్షన్ యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా వంటి పథకాలు సామాన్య ప్రజలకు ఆర్థిక రక్షణ కలిగిస్తాయని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మీనా తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇందిరా నగర్ పంచాయతీలోని పద్మావతిపురం కమ్యూనిటీ భవనంలో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె బీమా వల్ల సామాన్య ప్రజలకు కలిగే ఆర్థిక భరోసా, పథకాల వివరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సల్లా వీరభద్రయ్య, చిన్న పాండూరు ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ మేనేజర్ తేజ, సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై అవగాహన

రేణిగుంట: డెంగీ మాసోత్సవాలు, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బుగ్గవీధిలో వైద్య సిబ్బంది ఇంటింటా అవగాహన కల్పించారు. దోమల వలన వచ్చే వివిధ జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. ఇళ్ల ఆవరణలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ కామరాజు, ఆరోగ్య కార్యకర్తలు లోహిత, రాఘవేంద్రరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని ధర్నా



సత్యవేడు డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

సత్యవేడు: రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఉద్యోగోన్నతుల ఫైల్‌పై సంతకాలు చేసి 3000 మందికి న్యాయం చేయాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి మధుబాబు కోరారు. శుక్రవారం సత్యవేడు ఆర్టీసీ డిపో సమీపంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కార్మికసంఘ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ, పీఆర్సీ వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్ ప్రకటించాలన్నారు. అలాగే ఉచిత బస్సు పథకం సక్సెస్ కావాలంటే 2500 బస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వి.మహేశ్వర, డిపో అధ్యక్షుడు మనోహర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు మునస్వామి, వి.రాజు, కోశాధికారి కార్తీక్, గోవర్ధన్, శేఖర్, వెంకటయ్య, శేఖర్, శ్రీనివాసులు, శంకర్, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నా జన్మదిన వేడుకలు



పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న చిన్నా


వరదయ్యపాళెం: మండల కేంద్రం వరదయ్యపాళెం మేజర్ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి కన్నలి వెంకటయ్య (చిన్నా) జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణుల సమక్షంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులు ఆనయకు శాలువా కప్పి, గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబు రెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుడు దేవళ్ల మహేంద్ర (బీసీ సెల్), వినోద్ యాదవ్ (యువజన), దుడ్డు వేణు (ఎస్సీ సెల్), రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి శిబిచక్రవర్తి, మండల ప్రధాన కార్యదర్శి కొమిరి మాధవయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోండి

నారాయణవనం: అందుబాటులోని వనరులను సద్వినియోగం చేసుకుని పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవాలని డీపీవో సుశీలాదేవి సూచించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించి చెత్త సేకరణ, మురుగు కాలువ శుభ్రంపై మహిళలతో మాట్లాడారు. అనంతరం డంపింగ్ యార్డు, బృందావనాన్ని పరిశీలించారు. అరుణానదిలో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించి, ఎరువుల విక్రయంతో ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆస్తి పన్నుల విషయంలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోకుండా పంచాయతీ అభివృద్ధికి సహకారాన్ని అందించాలని డీపీఓ కోరారు. కొత్తగా ఏర్పాటవుతున్న లే అవుట్‌లలో తప్పనిసరిగా కమ్యూనిటీ పర్పస్ కోసం కేటాయించిన 10 శాతం భూమిని సంబంధిత పంచాయతీలు స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సిబ్బంది ఉన్నారు.

సమస్యలపై గరం..గరం

- గ్రామ సభకు డుమ్మా కొట్టిన వివిధ శాఖల అధికారులు
- గైర్హాజరుపై మండిపడిన నాయకులు




ఈఓకు సమస్యలు నివేదిస్తున్న వార్డు సభ్యుడు షేక్ మహమ్మద్ రసూల్

రేణిగుంట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. సమస్యలపై స్థానికులు నిలదీయడంతో అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. మరోవైపు వివిధ శాఖల అధికారులు సభకు డుమ్మా కొట్టడడంతో స్థానిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు..ఈవో మాధవి ఆధ్వర్యంలోని తొలుత వివిధ శాఖల అధికారులు నివేదికలను వెల్లడించారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, సంతలో అభివృద్ధి పనులు, ఇంటి నిర్మాణంలో రోడ్ల స్థలం ఆక్రమణ, ఇంటి పన్నుల వసూళ్లు, గ్రామసభ నోటీసు బోర్డులో పెట్టకపోవడం..ఇత్యాది విషయాలపై అధికారులను నాయకులు, స్థానికులు నిలదీశారు. గ్రామ సభకు అధికారులే రాకపోతే సమస్యలను ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు గ్రామ సభకు హాజరుకాని అధికారుల వివరాలను ఇవ్వాలని ఆదేశించారు. స్థానికులు నివేదించిన సమస్యలను నమోదు చేసుకున్న అధికారులు వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- పనిముట్ల పంపిణీలో చిత్తూరు ఎంపీ



పనిముట్లు పంపిణీ చేస్తున్న చిత్తూరు ఎంపీ

రేణిగుంట: వ్యవసాయ రంగం సంక్షోభానికి గురువుతోందని, ఈ నేపథ్యంలో రైతులను కాపాడుకోవాల్సి సామాజిక బాధ్యత అందరిపై ఉందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కరకంబాడి పంచాయతీ వన స్థలి సమీపంలోని రాస్- కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శిక్షణ, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిత్తూరు ఎంపీ మాట్లాడారు. రాస్-కృషి విజ్ఞాన కేంద్రం రైతాంగానికి చేస్తున్న సేవలను అధికారులు, శాస్త్రవేత్తలు వివరించారు. అనంతరం రైతులకు వ్యవసాయ పనిముట్లను ఎంపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, అసోసియేట్ డైరెక్టర్ సుమతి, రాస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, ప్రోగ్రెసివ్ ఫార్మర్లు నాగేశ్వరరాజు, కొండ యాదవ్, రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రాజశేఖర్ నాయుడు, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల అనుమతిపై విచారణ చేపట్టాలి

రేణిగుంట: విమానాశ్రయ సమీపంలోని బాలాజీ మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీ కోర్సులకు వచ్చిన అనుమతిపై సీబీఐ విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలాజీ మెడికల్ కళాశాలలో జరిగిన అవకతవకలపై గతంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు చర్యలు తీసుకోవడంలో కాలయాపన చేస్తున్నారన్నారని ఆరోపించారు.

స్వచ్ఛతతో వ్యాధులు దూరం



పల్లమాల బస్టాండు వద్ద చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రమణమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయని.. అందుకే పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవి శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని పల్లమాల గ్రామ సర్పంచ్ జొన్నల రమణమ్మ తెలిపారు. శుక్రవారం వారు స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పల్లమాల గ్రామ బస్టాండు, పచ్చాలమ్మ ఆలయ సమీపంలో, వీధుల్లో చెత్తాచెదారాలను పారిశుద్ధ్య కార్మికులు, జేసీబీలతో తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలు, పరిసరాలతో పాటు విధులను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షంతో ఆగిన 'తొలి అడుగు'

రేణిగుంట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని వెంకటాపురం పంచాయతీలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పర్యటించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించి వారికి పౌష్టికాహారాన్ని అందజేశారు. కొంతమంది పిల్లలకు అన్నప్రాసన, మరి కొంతమందికి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి తమ ప్రభుత్వం చేసిన పనుల గురించి ప్రజలకు వివరిస్తుండగా, ఇంతలో గాలులతో కూడిన వర్షం పడడంతో కార్యక్రమాన్ని అర్ధాంతరంగా ముగించి వెనుతిరిగారు. మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాదముని రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదల భవిష్యత్‌కు భరోసా కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: నియోజకవర్గంలో గుర్తించిన 12,756 నిరుపేద కుటుంబాల వారి భవిష్యత్‌కు భరోసా కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047 అమలులో భాగంగా నియోజకవర్గ యాక్షన్ ప్లాన్‌పై ఏడు మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ ఏఈలతో నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గంలో పేదరిక నిర్మూలనకు కృషి చేద్దామని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు త్రివిక్రమరావు, ప్రసాద్, బాలాజీ నాయక్, మహ్మద్ రఫీ, మాలతి, నాగరత్నమ్మ, టీవీ సుబ్రమణ్యం, హౌసింగ్ డీఈ శేషగిరి, వీకేఎస్ బాషా, మురళి, బాలమురళికృష్ణ, గుత్తి, త్యాగరాయం, ఏఈ ఇబ్రహీం ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శైలజ, ఏపీఎం డాంగేయాదవ్, ఎంఈఓ రవి, ఏపీఓ విజయభాస్కర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవిందస్వామి సేవలు వెలకట్టలేనివి



గోవిందస్వామి దంపతులను సత్కరిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: ఉపాధ్యాయ వృత్తిలో గోవిందస్వామి సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఆ మేరకు చిన్నఈటిపాకం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందిన గోవిందస్వామి వీడ్కోలు సభను శుక్రవారం వరదయ్యపాళెంలోని ఆర్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేష్ ఈ సందర్భంగా గోవిందస్వామి దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం కార్యక్రమంలో ఎంఈఓలు సరస్వతి, రవిబాబు, గున్నయ్య, మునిసుబ్రమణ్యం, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత కార్మిక విభాగం కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, దామోదర్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బందిల సురేష్, శివా యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో గోల్‌మాల్!

నాగలాపురం: మండలంలోని రాజుల కండ్రిగ పంచాయతీలో చేపట్టిన ఉపాధి పనుల్లో గోల్‌మాల్ జరుగుతోంది. పనులు సాగుతున్న ప్రాంతంలోకి ఫీల్డ్ అసిస్టెంట్ జీవిత రాకుండా తన బంధువును పంపుతూ నిధులను దిగమింగుతున్నట్లు సమాచారం.పనులకు రాని తమ బంధువులు, మిత్రుల పేర్లతో మస్టర్లు వేసుకుంటూ నగదు కాజేస్తున్నట్లు పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నించాల్సిన ఏపీఓ సైతం వారికే వంతపాడుతుండడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏపీఓ కనుసన్నల్లోనే నిధులు స్వాహా చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్ బేఖాతర్ చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నట్లు కూలీలు గుసగుసలాడుకుంటూ ఉండడం గమనార్హం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: పెండింగ్‌లో ఉన్న డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ప్రభుత్వం నుంచి అందక వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఉద్యోగాలు, ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్న పరిస్థితులతో నలిగిపోతున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ బకాయిలు చెల్లిస్తామన్న మాట ప్రకటనలకే పరిమితమైందని, రాష్ట్ర బడ్జెట్లో నిధులు ప్రకటించినప్పటికీ ఇప్పటికీ విద్యార్థుల ఖాతాలలో జమ కాకపోవడంతో కళాశాలకు వెళ్తే సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 6400 కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఏడాది పాలన సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ఈ సమస్యపై 11వ తేదీన కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, తదనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సమీకరించి చలో సీఎం కార్యాలయం పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం కార్యదర్శి అభి, నవీన్, కార్తీక్, పునీత్, సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.